క్లుప్తంగా

సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రారంభోత్సవం


ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో గురువారం సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఖాతాదారులు ఈ కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ చంద్రశేఖరన్, ప్రభాకరన్, చైర్మన్ ప్రసాద్, సహాయ మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఓం శక్తి భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు భారతి

తవణంపల్లె: మేల్‌మరవత్తూర్ ఓం శక్తి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడానికి దీక్షలో ఉన్న భక్తులకు తవణంపల్లె జెడ్పీటీసీ సభ్యురాలు భారతి గురువారం అన్నదానం చేశారు. దిగువ తడకరలో ఓం శక్తి భక్తులు వారం రోజులుగా మాలలు ధరించి దీక్షలో ఉన్నారు. వీరికి జెడ్పీటీసీ సభ్యురాలు భారతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానికులు, ఓం శక్తి భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల అంకెల గారడీ



విద్యార్థులు రూపొందించిన అంకెల చదరాలు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం అంకెల గారడీతో 2025 సంవత్సరానికి ఆహ్వానం పలికారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు సిరి, కీర్తన, జనని 3, 4, 5 గళ్ల వింత చదరాలతో ఎటు కూడినా 2025 వచ్చేలా పూరించారు. గణిత అవధాని అరుణ్‌శివప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు పూర్తించిన 3బై3, 4బై4, 5బై5 వింత చదరాలతో ఎటు కూడినా 2025 పూరించారన్నారు. 4బై4 వింత చదరంలో 24 రకాలుగా ఎటు కూడినా 2025 వస్తుందన్నారు. వింత చదరాల అంకెల గారడీ చేసిన విద్యార్థులను హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సంజీవి, రమాదేవి, పిళ్లారప్ప, సంపంగి, ధనశేఖర్, భారతి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన గణితఅవధాని అరుణ్‌శివప్రసాద్‌ను అభినందించారు.

ప్రతి ఒక్కరికీ వైద్యం


వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నట్లు స్థానిక వైద్యాధికారి సంధ్య అన్నారు. వసంతాపురంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ పేషెంట్లకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 58 మంది రోగులు పాల్గొన్నారు. మంచానపడ్డ రోగులకు ఇంటివద్దే వెళ్లి పరీక్షలు చేశారు.




బొమ్మాయిపల్లెలో ఇంటి పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం ట్రాన్స్‌ఫార్మర్, కొత్తపల్లె వద్ద తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, తగ్గువారిపల్లెలో రహదారి పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్.. టెర్రర్

- పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- భయపెడుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు.
- ఇళ్ల పక్కనే కరెంట్ స్తంభాలు


మొగిలివెంకటగిరి వద్ద కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

బంగారుపాళెం: మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వాటిని చూస్తేనే షాక్ కొట్టేంత భయం ప్రజలను వెంటాడుతోంది. గృహాలపై విద్యుత్ తీగలు ప్రమాద కరంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుడడంతో ప్రజలకు, మూగ జీవాలకు ప్రాణసంకటంగా మారింది. మండలంలో 3,556కు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 21,930 పైగా గృహ సర్వీసులు, 7597 పైగా వ్యవసాయ సర్వీసులు ఉన్నాయి. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు రహదారి పక్కన, వ్యవసాయ పొలాల వద్ద, గ్రామాల్లో నివాస గృహాల పక్కన ఏర్పాటు చేశారు. అయితే వీటి చుట్టూ సరైన రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామాల్లో నివాస గృహాలపైన, ఇళ్ల పక్కన కరెంట్ స్తంభాల్లో తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. విద్యుత్ ప్రమాదాల కారణంగా మనుషులు, మూగజీవాలు మృతి చెందిన సంఘటనలు కోకొల్లలు. గత ఏడాది నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో కూడా పలుగ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యాత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను తొలగించాలంటూ ప్రజలు అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మండలంలో చోటు చేసుకున్న ప్రమాదాలు

- గత సంవత్సరం గుండ్లకట్టమంచి దళితవాడలో ఇంటి పక్కన గల విద్యుత్ స్తంభం నుంచి కరెంట్ సరఫరా కావడంతో ఇద్దరు మృతి చెందారు.
- 2018లో శేషాపురం గ్రామ సమీపంలో పొలాల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగ షాక్ కొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు.
- 2016లో తగ్గువారిపల్లెలో బంగారుపాళెం-అరగొండ రహదారి పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద వ్యక్తి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు.
- 2023లో మొగిలివెంకటగిరి జాతీయ రహదారి పక్కన తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి ఆవు మృతి చెందింది. ఇలా మండలంలో చాలా చోట్ల విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
- 2024లో తగ్గువారిపల్లెలో ఇంటి పక్కనే గల విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలు ప్రమాదవశాత్తు తగిలి పెయింటర్ మృతి చెందాడు.

రక్షణ చర్యలు తీసుకోవాలి

మనుషులకు, మూగజీవాల పాలిట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. వ్యవసాయ పొలాలు, రహదారుల పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు తీసుకోవాలి.
–గోవిందయ్య, రైతు, బంగారుపాళెం

హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలి. అదేవిధంగా ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. వ్యవసాయ పొలాల వద్ద చేతికందే ఎత్తులోనే విద్యుత్ తీగలు ఉన్నాయి. అలాంటి వదులుగా ఉన్న విద్యుత్ తీగలను మరమ్మతులు చేయాలి.
–మురళి, తగ్గువారిపల్లె

నివాస గృహాలపైనే విద్యుత్ తీగలు

ఇళ్లపైనే కరెంట్ తీగలు ఉండడం వల్ల ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాలను నిర్మించుకోలేని పరిస్థితి. లబ్ధిదారుల ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోతోంది.
– ప్రసాద్‌బాబు, బంగారుపాళెం

చర్యలు తీసుకుంటాం

మండలంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు కంచె ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారుల నివేదికలు పంపి చర్యలు తీసుకుంటాం. అలాగే లూజ్‌లైన్ల మరమ్మతులు చేపడతాం. నివాసగృహాల మీదుగా ఉన్న కరెంట్ తీగలను పక్కకు మార్చేందుకు చర్యలు తీసుకుంటాం.
–హేమచంద్రుడు, ట్రాన్స్‌కో ఏఈ, బంగారుపాళెం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. 6 నెలల నుంచి 24 నెలల వరకు ఉన్న చిన్నారులకు తరచూ పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని అందించవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైభవం.. కోనేటిరాయని కల్యాణం



గంగవరం: మండలంలోని కీలపట్ల శ్రీకోనేటిరాయ స్వామి ఆలయంలో గురువారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీకోనేటిరాయ స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చి మాంగళ్యధారణ గావించారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్ష దీక్షితులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి


ఉద్యోగులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

ఐరాల: సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ ధనలక్ష్మి సూచించారు. ఆమె గురువారం మండలంలోని పుత్రమద్ది, మిట్టూరు, ముదిగోళం సచివాలయాలను సందర్శించారు. సిబ్బంది హాజరు, పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మర్యాదగా మెలగాలని సూచించారు. అనంతరం పంచాయతీల పరిధిలోని చెత్త సంపద కేంద్రాలను సందర్శించి, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందికి ఆదేశించారు. ఇంటింటి నుంచి పకడ్బందీగా తడి, పొడి చెత్తను సేకరణ చేయాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వర్షాలకు దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి


గొయ్యిలో పడిన వ్యక్తిని బయటకు తీసిన స్థానికులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో మురుగునీటి కాలువ గొయ్యి ప్రమాదకరంగా మారింది. వడ్డూరు గ్రామానికి చెందిన వ్యక్తి గురువారం ఈ గోతిలో పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానిక పాత పోస్టాఫీస్ రోడ్డు నుంచి రహదారి మీదుకు వెళ్లే రోడ్డు పక్కనే ఈ గొయ్యి ఉంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు గొయ్యి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టక పోవడం మూలాన ప్రమాదవశాత్తు పలువురు ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 10 మందికి పైగా పడిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారి పక్కన ప్రమాదకర గొయ్యి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'మా గ్రామానికి దారి చూపించండి'

వెదురుకుప్పం: మట్టి రోడ్డుపై ముళ్ల కంపలు, రాళ్లు వేసి రోడ్డు మూసి వేశారు.. విద్యార్థులు పాతగుంటకు వెళ్లాలన్నా మండల కేంద్రానికి వెళ్లాలన్నా దారి లేక అవస్థలు పడుతున్నాం...గ్రామం నుంచి బయట ప్రపంచానికి వెళ్లాలంటే దారి లేదు...దారి సౌకర్యం కల్పించాలని మండలంలోని కేవీఎం అగ్రహారం గ్రామస్తులు గురువారం తహసీల్దార్ రమేష్‌బాబుకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరాలుగా ఉన్న రోడ్డును బలిజపల్లె గ్రామస్తులు మూసివేసి అడ్డుకుంటున్నారని వాపోయారు. గ్రామం నుంచి విద్యార్థులు పాతగుంట జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారని ఈకారణంగా పాఠశాలకు వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా తమ అవసరాల నిమిత్తం బయటి ప్రాంతాలకు వెళ్లాలన్నా రోడ్డు లేక ఇక్కట్లు పడుతున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజులుగా దారి లేకుండా బయటకు వెళ్లలేకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దారి సమస్యకు శాశ్వతపరిష్కారం చూపాలని కోరారు.

ఆస్పత్రిలో ప్రసవం శ్రేయస్కరం


జొన్నగురకలలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని జొన్నగురకల గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 43 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నలిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని నలిశెట్టిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ గర్భవతులకు, బాలింతలకు పరీక్షలు చేయించారు. బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

బంగారుపాళెం: భూ సమస్యలు పరిష్కరించడానికే మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వ హించనున్నట్లు తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని శెట్టేరి, తూంపాయనపల్లెలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, సమస్యలు ఏమైనా ఉంటే రైతులు రాతపూర్వకంగా అందజేయాలన్నారు. వివిధ భూ సమస్యలపై 9 మంది రైతులు అర్జీలు అందజేసినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ మధుసూదన్, మండల సర్వేయర్ లావణ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో కమిటీలే కీలకం


అవగాహన కల్పిస్తున్న ఎంఈఓలు

బంగారుపాళెం: మండలంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, యాజమాన్య కమిటీల్లోని సభ్యులకు మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రిసోర్సు పర్సన్లు లక్ష్మీపతి, మురళీకృష్ణ, షబానాభాను పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీ సభ్యులు, చైర్మన్ పాత్ర, విధులు, తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు మాట్లాడుతూ, మండల స్థాయిలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ సభ్యులు ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు పాఠశాలల్లో నిర్వహించే శిక్షణా సభ్యుల విధులు, పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.


విద్యాభివృద్ధికి కృషి చేయాలి



యూటీఎఫ్ నాయకులతో కలిసి డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

ఐరాల: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు పేర్కొన్నారు. నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండల యూటీఎఫ్ శాఖ 2025 యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను ఎంఈఓలు ఆవిష్కరించారు. ఎంఈఓలు మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో మండలం జిల్లాలోనే ప్రత్యేకమైన గుర్తింపును సాధించేలా ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని ఆకాంక్షించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏకాంబరం మాట్లాడుతూ కాకినాడలో ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు తరలివచ్చి ఉపాధ్యాయుల ఐక్యతను ప్రభుత్వానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు దేవరాజులు, ప్రధానకార్యదర్శి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక వర్గాలకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులకు అందించే సౌకర్యాలు సకాలంలో అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షులు జనార్దన్, లీలావతి, కోశాధికారులు సుధాకర్, సురేష్, మండల కార్యదర్శులు వెంకటముని, గుణసుందరి, నాగరాజు, అమ్ములు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

గుడిపాల: ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ చిత్తూరు ఉద్యోగుల క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో వ్యవసాయశాఖ అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పనిని బాధ్యతగా తీసుకుని పనిచేయాలని సూచించారు. ఉద్యోగులందరూ కలిసుంటేనే ఏ పని అయినా సులువుగా చేసేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంజయ్య, కార్యదర్శి బాలమురుగన్, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండా గ్రామసభలు!


తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న రైతు కృష్ణమనాయుడు

శ్రీరంగరాజపురం: ప్రభుత్వం నిర్వహించే ఏ కార్యక్రమమైనా అధికారులు ప్రజలకు తెలియజేస్తేనే సమాచారం అందుతుందని రెవెన్యూ గ్రామసభలో రైతు కృష్ణమనాయుడు తహసీల్దార్ లోకనాథపిళ్లైతో వాగ్వాదానికి దిగారు. మండలంలోని కటికపల్లిలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. కటికపల్లి రెవెన్యూలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోందని ఆరోపించారు. కటికపల్లి పంచాయతీలో అనేక భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు గ్రామసభలు ప్రజలకు తెలియజేయకుండా నిర్వహిస్తే ప్రయోజనం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్కొండయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడే బార్ ఎన్నికలు

- బరిలో 18 మంది న్యాయవాదులు.. 385 మంది ఓటర్లు
- ఉదయం పోలింగ్.. సాయంత్రం కౌంటింగ్.. ఫలితాలు
- ఈసీ స్థానాలు ఏకగ్రీవం.. మిగిలిన వాటికి తప్పని పోటీ



చిత్తూరులోని న్యాయవాద సంఘ కార్యాలయం

చిత్తూరు అర్బన్: చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలోని న్యాయవాద సంఘ (బార్) ఎన్నికలు శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లన్నీ సిద్ధం చేశారు. బ్యాలెట్ పత్రాలు, కౌంటింగ్ పక్రియకు కావాల్సిన వస్తు సామగ్రిని, ఇతర పనులు మొత్తం పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి వసంతకుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, 385 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇదే రోజు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఎన్నడూ లేనివిధంగా ఈ దఫా బార్ అధ్యక్ష పదవికి ఐదుగురు పోటీ పడుతుండడంతో న్యాయవాద వర్గాలు ఈ ఎన్నికలను ఆసక్తిగా పరిశీలిస్తున్నారు.

బరిలో ఉన్నది వీళ్లే!

అధ్యక్ష పదవికి ఐదుగురు పోటీ పడుతుండగా వీరిలో చంద్రశేఖర్, శంకర్ నాయుడు, హరికృష్ణమ నాయుడు, మోహనరామిరెడ్డి, జానకిరామిరెడ్డి ఉన్నారు. ఉపాధ్యక్షుల బరిలో లోకనాథన్, భూ పసన్న, ప్రధాన కార్యదర్శిగా చక్రవర్తిరెడ్డి, సురేష్‌రెడ్డి, విశ్వనాథ్ పోటీ పడుతున్నారు. కోశాధికారిగా ఎస్. ఆనంద్, దేవేంద్రనాథ్, మహేష్, క్రీడా కార్యదర్శిగా శాంతి, రామచంద్ర యాదవ్, వెంకటేష్, లైబ్రరీ కార్యదర్శిగా వరదరాజులు, రవిచంద్రన్ బరిలో ఉన్నారు. అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న వాళ్లందరూ సీనియర్లు కావడంతో అందర్నీ ఒప్పించి, ఒకర్ని ఏకగ్రీవం చేయాలనే ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఇదే సమయంలో కార్యనిర్వాహక సభ్యుల (ఈసీ) పోస్టులను మాత్రం ఏకగ్రీవం చేయగలిగారు. కార్యనిర్వాహక సభ్యులుగా సీనియర్ విభాగంలో చిన్నబ్బ, శరవణ, జూనియర్ విభాగంలో అక్బర్ బాషా, తులసీరామ్, రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల రోజులుగా నెలకొన్న బార్ ఎన్నికల వ్యవహారంలో పోలింగ్ పూర్తయ్యి, ఫలితాలు వెలువడేందుకు మరికొన్ని గంటలే ఉండడంతో న్యాయవాదుల్లో ఉత్కంఠ నెలకొంది.